క్లుప్తంగా

వెంకన్న నిత్య సేవలు రద్దు

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఈనెల 11 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలను 9 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మే 5వ తేదీ సోమవారం నుంచి 25న ఆదివారం వరకు నిత్య ఆర్జిత కల్యాణోత్సవాలు, శుక్ర, శనివార ఊంజల్ సేవలు, పక్షోత్సవాలను ఈనెల 25 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

4న ముక్కంటికి ధారా పాత్ర ఏర్పాటు

శ్రీకాళహస్తి: నిత్యం ఛత్రం నీడనదర్శనమిచ్చే స్వయంభు శ్రీకాళహస్తీశ్వరస్వామి మే 4 నుంచి 28వ తేదీ వరకు ధారాపాత్రతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఏటా మండు వేసవిలో వచ్చే డొల్లకర్తరీ, నిజకర్తరీ సందర్భంగా స్వామి వారిపై నిత్యం పచ్చ కర్పూర జలధారగా ఈ పాత్ర ఏర్పాటు చేయనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యుడు బాధ్యతల స్వీకరణ



పిచ్చాటూరు ఆస్పత్రి వైద్యురాలు మునిచరిత నుంచి ఫైల్స్ అందుకుంటున్న డాక్టర్ ధనుష్

నాగలాపురం: పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ధనుష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పిచ్చాటూరు ఆస్పత్రికి ఇద్దరు వైద్యులు ఉండాల్సిన నేపథ్యంలో రెండు నెలలుగా డాక్టర్ మునిచరిత ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి పల్నాడు జిల్లా క్రోసులో పనిచేస్తున్న డాక్టర్ ధనుష్‌ను సాధారణ బదిలీపై పిచ్చాటూరు ఆస్పత్రికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

వరదయ్యపాళెం: మండలంలోని కువ్వాకొల్లి గ్రామ సమీపంలో అక్రమంగా బెల్టు షాపును నిర్వహిస్తున్న శీనుని శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకుని అతడి వద్ద ఉన్న 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పైపులైన్ లీకేజీ అరికట్టండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులోని తాగునీటి పైపులైన్ లీకేజీతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్‌పైపులైన్ కోసం రోడ్డు తవ్వడంతో తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. పైపులైన్ మరమ్మతు చేపట్టకుండా గ్యాస్ పైపులైన్ కోసం తీసిన గుంతలు పూడ్చేశారు. ఫలితంగా పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. లీకేజీ నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. లీకేజీ కారణంగా తాగునీరు కలుషితం కావడంతో ఆ నీటిని తాగుతున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ గోపి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని జీకే రెడ్డి కాలనీలోని ఖాళీ ప్రదేశంలో మద్యం తాగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించిన చర్యలు తప్పవన్నారు. అదుపులోకి తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేలరాలిన ఆశలు

- మామిడి తోటల్లో గజరాజుల విధ్వంసం
- భయాందోళనలో అన్నదాతలు
- పరిశీలన సరే పరిష్కారం ఏదీ ?
- మామిడి రైతుల ఆందోళన



మామిడి చెట్లను ధ్వంసం చేస్తున్న ఏనుగు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మామండూరు మామిడి రైతులు భయపడిందే నిజమైంది. ఏటా ఏనుగుల దాడుల వల్ల మామిడి చెట్లను, చేతికందొచ్చిన పంటలను నష్టపోతున్నామని ముందస్తు చర్యలు తీసుకోవాలని మూడు నెలల కిందటే అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో గజరాజులు మళ్లీ మామిడి తోటల్లో పడి విధ్వంసం సృష్టించాయి. పరిశీలనకు వచ్చిన అధికారుల ముందు అన్నదాతలు తమ గోడును తెలియజేశారు.

రేణిగుంట మండలం మామండూరు గ్రామ సమీపంలో శేషాచల అడవులకు ఆనుకొని 130 ఎకరాల మామిడి తోటలు ఉన్నాయి. తోటల చుట్టూ గతంలో 10 అడుగుల లోతు 10 అడుగుల వెడల్పుతో కందకాలు తవ్వారు. కాలక్రమేణ కందకాలు పూడిపోవడంతో అడవి నుంచి గజరాజులు మామిడి తోటల వైపు వచ్చి ఏటా ధ్వంసం చేస్తున్నాయి. రైతులు అనేకసార్లు అటవీశాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా లాభం లేకుండా పోయింది.

అధికారులకు మొరపెట్టుకున్నా..

మూడు నెలల కిందట రైతులు అధికారులకు ఈసారైనా మామిడి తోటలను కాపాడండి అని మొరపెట్టుకున్నారు. అయినా అధికారులు స్పందించలేదు. గత 20 రోజులుగా మామిడి తోటల్లోకి ఏనుగుల గుంపు చొరబడి ఘీంకార శబ్దాలతో చెట్లు కొమ్మలు విరిచి, నానా బీభత్సం సృష్టించాయి. కాపుకు వచ్చిన మామిడి తోటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతులు పూర్తిగా నష్టానికి గురై రోదిస్తూ వణికిపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించకపోవడం వల్లే తాము తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలని కోరుతున్నారు.







ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన మామిడి చెట్లు

నష్టపోయాం.. న్యాయం చేయండి సార్..



మాకు నాలుగెకరాల మామిడి తోట ఉంది. 200 చెట్లు ఉండగా సుమారు 100 చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా పట్టించుకోలేదు. మా కుటుంబానికి మామిడి తోటే జీవనాధారం.ఇప్పుడు ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– కుషీద్, మహిళా రైతు, మామండూరు

అధికారుల నిర్లక్ష్యం వల్లే నష్టపోయాం



ఫారెస్ట్ అధికారులు మాపై చూపిన నిర్లక్ష్యం వల్లే ఈ ఏడాది కూడా నష్టపోయాం. అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని ఉంటే మాకు ఈ గతి పట్టేది కాదు. ఏనుగులు మా తోటలకు పూర్తిగా నాశనం చేశాయి. చేతికందొచ్చిన పంట నోటి కందకుండా పోయింది. నష్టం జరిగాక అధికారులు పరిశీలనకు రావడం.. వెళ్లడం పరిపాటిగా మారింది. మాపై దయ ఉంచి ఏనుగులు పొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకోండి.

–చిట్టెమ్మ, మామండూరు

నష్టపరిహారం అందేలా చూస్తాం



మామండూరులో ఏనుగుల వల్ల మామిడి తోటలు నష్టం జరిగాయని సమాచారం అందింది. ధ్వంసం అయిన మామిడి చెట్లను పరిశీలించా. అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు వచ్చి పంట నష్టాన్ని అంచనా వేస్తారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులు రాత్రి సమయాల్లో తోటల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

–నాగేశ్వరరావు, సబ్ డీఎఫ్ఓ

పోషకాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నారాయణవనం: కిశోర బాలికలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని పలువురు సూచించారు. కిశోర బాలికల సాధికారత– అందరి బాధ్యత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కసిమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మహిళా పోలీస్ శ్రావణి, ఏఎన్ఎం భారతి మాట్లాడుతూ.. కిశోర దశలో పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. రుతుస్రావ చక్రంపై శ్రద్ధ చూపాలని, రక్తహీనతను అధిగమించాలని సూచించారు.

సరైన పత్రాలతోనే వాహనాలు నడపాలి



ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి: సరైన పత్రాలు ఉంటేనే వాహనాలను నడపాలని ఒకటో పట్టణ సీఐ గోపి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెళ్లి మండపం కూడలి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్సు, వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ సరైన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

సింహ వాహనంపై అగస్తీశ్వరుడు



సింహ వాహనంపై కొలువుదీరిన స్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి దూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం పూజలను అందుకున్న ఉత్సవమూర్తులు సుందరంగా అలంకరించి సింహ వాహనాన్ని అధిరోహించారు. టీటీడీ ఏఈఓ రవి, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, గౌతమ్ గురుకళ్ తదితరులు పర్యవేక్షించారు.

- మూడో రోజు శనివారం సాయంత్రం అగస్తీశ్వర స్వామి హంస వాహనంపై ఊరేగనున్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆది శంకరాచార్యుల చిత్రపటానికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని కళారాధన మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి విశేష పూజలు చేశారు. దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, వేద పండితులు శివప్రసాద్ శర్మ, శ్రీనివాసులు శర్మ, అర్చకులు అర్ధగిరి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఇండో–ఎంఐఎం కంపెనీ సహకారంతో అమర హాస్పిటల్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది సభ్యులు ఉత్సాహంగా రక్తదానాన్ని ఇచ్చి తమ ఔన్నత్యాన్ని చాటారు. ఇండో–ఎంఐఎం ఇన్‌చార్జి దాసరి కిరణ్ కుమార్ చొరవతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. హాస్పిటల్ న్యూరాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆసుపత్రి నిర్వాహకురాలు శ్రీధర్, దాతలకు అభినందనలు తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ చిన్నదొరై సుధా

నాగలాపురం: పట్టణంలోని సన్నిధివీధి నుంచి ఉత్తరపుకోట వీధికి వెళ్లే రోడ్డు పక్కన డ్రైనేజీ పనులకు మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో భూమిపూజ చేసి డ్రైనేజీ పనులను ప్రారంభించినట్లు కార్యదర్శి రమేష్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2 లక్షలతో నూతన డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత, నాయకులు మోహన్ మొదలియార్, హరిబాబు, కులశేఖర్ రెడ్డి, ఉదయ్ కుమార్, ధనరాజ్, చిరంజీవి, ప్రకాష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ: రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని రైతుల పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రైతు పొలంలోని మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపుతామన్నారు. ల్యాబ్ ఫలితాల ఆధారంగా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. నమూనాలు సేకరించిన పొలంలో ఎలాంటి పంటలు సాగు చేసుకోవాలనే విషయాలు చెప్పడంతో పాటు పచ్చిరొట్ట ఎరువు, పశువుల ఎరువుల ఎంత మోతాదులో వేయాలనే విషయాలను తెలియజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రేవతి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రేణిగుంట: కిశోర బాలికలు సమతుల పౌష్టికాహారాన్ని తీసుకుని రక్తహీనత వంటి లోపాలను సవరించుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం– శిక్షణ తరగతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ.. కిశోర బాలికలలో సంభవించే శారీరక మార్పులకు అనుగుణంగా మానసిక సన్నద్ధతను అలవర్చుకోవాలన్నారు. రక్తహీనతను నిర్మూలించే ఆహార పదార్థాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు రేణుక, హరిత అంగన్‌వాడీ టీచర్లు బుజ్జమ్మ, కుమారి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

భక్తులకు నాణ్యంగా ఆహారం అందించాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు నాణ్యంగా, శుచి, రుచిగా ఆహారాన్ని అందించాలని ఈఓ బాపిరెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి ఆలయ అన్నదాన కేంద్రాన్ని తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండాలన్నారు. అనంతరం అల్పాహారం రుచి చూశారు. భక్తులకు అందించే అల్పాహారం, అన్నదానం నాణ్యంగా, రుచిగా ఉండాలని, అన్నదాన భవనాన్ని శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు దీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్ బకాయిల వేధింపులు ఆపండి

సత్యవేడు: విద్యుత్ బకాయిల పేరుతో దళిత, గిరిజనులపై వేధింపులు ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో దళితులు, గిరిజనులకు 200 యూనిట్లు, 300 యూనిట్లు ఫ్రీ అని చెప్పారు. అప్పుడు వాడిన విద్యుత్ బిల్లుకు ఇప్పుడు బిల్లు చెల్లించాలని, లేకుంటే విద్యుత్ సర్వీసులు తొలగిస్తామని చెప్పడం దారుణమన్నారు. చిన్నఈటిపాకంలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి సర్పంచ్ గోవిందస్వామికి చెందిన గృహ విద్యుత్ కనెక్షన్ రూ. 40 వేలు బిల్లు చెల్లించాలని లేదంటే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించడం ఎంత వరకు న్యాయమన్నారు. ప్రస్తుతం పేదలపై విద్యుత్ బకాయిల వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఎం తరపున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గాజులమండ్యం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎఫ్ ఆర్ఎస్, డెలివరీలు, ఓపీ సేవలు, ఈహెచ్ఆర్, హై రిస్కు ప్రెగ్నెన్సీ డేటా, ఇతర జాతీయ కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



ఇందిరానగర్ సచివాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శుక్రవారం డీఎల్‌పీఓ సురేష్ నాయుడు విచారణ చేపట్టారు. ఇందిరానగర్ పంచాయతీకి చెందిన ఆడిపూడి ఆశ ఫిర్యాదు మేరకు స్పందించిన జిల్లా యంత్రాంగం విచారణ అధికారిగా డీఎల్‌పీఓను నియమించడంతో ఆయన గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగం సమయంలో బాధ్యతలు నిర్వహించిన కార్యదర్శి సమక్షంలో రికార్డులను పరిశీలన చేశారు. పంచాయతీకి మంజూరైన నిధులు, అభివృద్ధి పనులకు సంబంధించి ఖర్చు చేసిన నిధుల వివరాలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఈ విచారణకు పూర్వపు సర్పంచ్ రసూల్ సాహెబ్, ప్రస్తుత సర్పంచ్ వీరభద్రం హాజరయ్యారు.

సామాజిక అంశాలపై అవగాహన

నాగలాపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న సచివాలయం–1లో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ జనార్దనరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. 11 ఏళ్ల నుంచి 18 సంవత్సరాల లోపు గల కిశోర బాలికలకు వేసవి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ కార్యక్రమాలు జూన్ 10వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ.. కిశోర బాలికలకు సామాజిక అంశాలపై అవగాహనతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలతో వారిలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఇమ్మానివేల్, మహిళా సంరక్షణ కార్యదర్శి శ్వేత, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

లే'అవుట్'

- ఇందిరానగర్‌లో జగనన్నకాలనీ ఆక్రమణ
- జగనన్నకాలనీకి కేటాయించిన లేఅవుట్ ధ్వంసం
- రాత్రికి రాత్రే జేసీబీతో సర్వే రాళ్లు తొలగింపు
- చదును చేసిన ఆక్రమణదారుడు
- స్థానిక టీడీపీ నేత పన్నాగం

ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. అది ఎలాంటిదైనా తమ ఖాతాలో వేసుకోవడానికి కూటమి నేతలు బరితెగిస్తున్నారు. చెరువులు పోయే..దొరువులుపోయే.. చివరకు పేదలకు కేటాయించిన లేఅవుట్‌ను సైతం కాలకూటమి నేతలు వదలడం లేదు. వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్‌లోని జగనన్నకాలనీ లేఅవుట్ పైనా ఓ టీడీపీ నేత కన్నేసి ఆక్రమించాడు. సర్వేరాళ్లను ధ్వంసం చేసి, చదును చేసుకున్నాడు.

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన ఇళ్లు లేని నిరుపేద కుటుంబాల కోసం గత ప్రభుత్వం జగనన్నకాలనీ కోసం కేటాయించిన లేఅవుట్‌ను స్థానికంగా ఉన్న ఓ టీడీపీ నాయకుడు ఆక్రమించుకున్నాడు. రెండు రోజులుగా జేసీబీతో లేఅవుట్‌ను చదును చేసి, సర్వే రాళ్లను ధ్వంసం చేసి ఏకంగా జగనన్న కాలనీ లేఅవుట్ రూపురేఖలను మార్చేశాడు. లే అవుట్‌లో పట్టాలు పొందిన బాధితులు సైతం ఈ విషయమై ఆందోళన చెందుతున్నారు.

కురింజల్లం రెవెన్యూలో లే అవుట్

గత ప్రభుత్వ హయాంలో ఇందిరానగర్‌లో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు చెందిన 68 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం కురింజల్లం రెవెన్యూలోని సర్వే నంబర్ 113, 114లో సుమారు 2 ఎకరాల్లో జగనన్నకాలనీ ఏర్పాటుకు లేఅవుట్ సిద్ధం చేశారు. ఆ మేరకు 68 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించి, సర్వే రాళ్లు నాటారు. కొందరు ఇళ్ల నిర్మాణం కోసం సిద్ధమైనప్పటికీ సార్వత్రిక ఎన్నికలు రావడంతో బిల్లులు సకాలంలో అందవని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల పనులను వాయిదా వేసుకున్నారు. అయితే కొద్దిరోజులుగా ఆ స్థలంపై కన్నేసిన స్థానిక టీడీపీ నేత ఏకంగా లేఅవుట్‌కు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధమయ్యాడు. కొన్ని రోజులుగా సంబంధిత లేఅవుట్‌లో జేసీబీ ద్వారా చదును చేసి, సర్వే రాళ్లు తొలగించాడు. దీనిపై రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. అయితే అక్కడ పట్టాలు పొందిన లబ్ధిదారులు ఆందోళన చెంది, గ్రామస్థాయి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు.



ఇందిరానగర్ గ్రామస్తులకు కేటాయించిన జగనన్న లేఅవుట్‌ను ఆక్రమించేందుకు జేసీబీతో చదును చేసిన దృశ్యం



జగనన్న లేఅవుట్‌లో ఆక్రమణదారుడు ధ్వంసం చేసిన సర్వే రాళ్లు

చర్యలు తీసుకుంటాం

ఇందిరానగర్ గ్రామస్తులకు కేటాయించిన హౌసింగ్ లేఅవుట్ ఆక్రమణ విషయం తన దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ద్వారా పరిశీలన చేసి కాలనీకి కేటాయించిన స్థలాన్ని చదును చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి చెందిన భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోం.

–రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం మండలం